# పురిటిపాటలు

—చిగిచెర్ల కృష్ణారెడ్డి ఎం. ఏ.

మానవ జీవితంలో స్త్రీకి పురుషునితో సమానమైన ప్రాతినిధ్యంవుంది. జానపద జీవితంలో స్త్రీ పాత్ర అనితర తుల్యమని చెప్పవచ్చు. కష్ట నష్టాలకు ఓర్చుకొనే శక్తి జానపద స్త్రీకున్నంతగా నగరాల్లో నివసించే స్త్రీకి ఉండదు. అన్ని పనుల్ని చేసుకుంటూ అత్త మామల్ని వినయ విధేయతలతో గౌరవిస్తూ ఆడపడుచుల్ని అభిమానంతో ఆదరిస్తూ మరిది గార్లను మక్కువతో చూచుకుంటూ. భర్తకు అనురాగాన్ని అందిస్తూ తన కష్టాల్ని మరచిపోతుంది. సంతానం కావాలనే ఆరాటం పురుషుని కంటే స్త్రీకి ఎక్కువ. తల్లి కావాలనే ఆవేదన జానపద స్త్రీలో మరింత ఎక్కువగా కన్పిస్తుంది. అందుకే సంతాన హీనురాలైన స్త్రీ ప్రతి చెట్టును. పుట్టను పూజిస్తూ. వ్రతాలు నోములునోస్తూ, మంత్ర తంత్రాలతో సంతానం కలుగుతుందనే నమ్మకంతో ఆశతో ఎదురు చూస్తుంది. సంతాన హీనురాలైన స్త్రీకి జానపదుల్లో గౌరవం లేదు. చిన్నదానికి పెద్దదానికి గొడ్రాలితనాన్ని ఎత్తి చూపుతుంటారు.

గర్భంధరించి తొమ్మిది నెలలు నిండి, నొప్పులు రావడం జరిగినపుడు ఆ నొప్పులు గొడ్రాలికి తెలిసేవి కావు అటూంటారు. ఆ బాధ అనుభవైక వేద్యమన్న మాట. ప్రసవించడమంటే మళ్ళీ జన్మ ఎత్తడంతో సమానం. కొద్ది మంది ప్రసవ సమయములో మరణించడం కూడా జరుగుతుంటుంది.

కష్టనష్టాల్లో ఆదుకొనేగుణం జానపదులకున్నంతగా నగరవాసులకుండదు. ఎదుటి వాళ్లు బాధ పడుతుంటే ఆ బాధ తమకే వచ్చిందా అన్నంతగా ఆరాటపడిపోతారు. అంత ఆర్ద్ర హృదయం వాళ్లది. ప్రసవ సమయంలో నొప్పులు ప్రారంభంకాగానే అన్నిపనులు వదలి పెట్టి చుట్టు ప్రక్కల స్త్రీ లందరూ చేరిపోతారు. ప్రసవ సమయంలో చేయాల్సిన పనుల్లో తీసుకోవలసిన జాగ్రత్తల్లో నైపుణ్యం వున్నవాళ్ళు కొందరుంటారు. ఆ సమయంలో అలాంటి వాళ్లపై తప్పక ఆధారపడతారు. వారినే జానపదులు 'మంత్రసానులు' అని వ్యవహరిస్తారు.

ప్రసవ వేదన సమయంలో స్త్రీ తన బాధను మరచిపోవడానికి, ఆమె మనసును మళ్ళించడానికి నారాయణ శతకము. భాగవతము రామాయణం లాంటి గ్రంథాలను చదవడం ఉంటుంది. గర్భస్థుడైన ప్రహ్లాదుడు నారదుని ద్వారా నారాయణ మంత్రాన్ని వినడం వల్లనే పరమ భాగవతుడుగా తయారయ్యాడని మనవాళ్ల నమ్మకము. అందువల్లనే గర్భిణీ స్త్రీ మనసు ఆహ్లాదంగా ఉండాలని తీరని కోరికలేవీ ఉండకూడదని అంటారు. ఫలహారాలు వండి పెట్టడంలోని పరమార్థమే ఇది.

కొన్ని ప్రాంతాల్లో ప్రసవ సమయంలో బాధపడుతున్న స్త్రీ మనసును మళ్ళించడానికి కాబోలు ఇతర స్త్రీలు పాటలు పాడటం ఉంది. ఆ పాటలు వింటుంటే ఎంత కఠిన హృదయమైన ద్రవించి పోతుంది. పాట పాడుతున్న స్త్రీ కళ్ళల్లో వింటున్న వాళ్ళ కళ్ళల్లో కన్నీళ్ళు కాల్వలు గట్టడం చూడవచ్చు. అంత ఆర్ద్రంగా ఉంటాయా పాటలు. ఆ సమయంలో నీళ్ళు చిప్పిల్లడానికి కారణం